

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.1 : కనిష్ఠం 20.6
నిర్మల్ జిల్లా వార్తలు
గురువారం 15 ఫిబ్రవరి 2024



గుడిలోకి వెళ్లే భక్తుల క్యూలైన్లలో పరిస్థితి ఇలా..


గుడిలోకి వెళ్లకుండా ఆలయం వెలుపల కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


క్యూలైన్లలో గంటల తరబడి వేచి చూడలేక ఉత్తరద్వారం నుంచి దూరదర్శనం చేసుకుని వెళ్లిపోతున్న భక్తులు


కదలిక లేని క్యూలైన్లలో పసిపిల్లలలో నిలబడలేక కూర్చున్న తల్లులు


పిల్లల అక్షర శ్రీకార పూజలు జరిపించేందుకు పోటీ పడుతున్న భక్తులు

అమ్మో..! బాసర

- వసంత పంచమి వేడుకల్లో భక్తులకు తీవ్ర కష్టాలు
- సౌకర్యాల ఏర్పాటులో యంత్రాంగం విఫలం
- సెల్‌ఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేసి గదులకే పరిమితమైన అధికారులు
- ఇబ్బందులతో విలవిలలాడిన చిన్నారులు, వృద్ధులు
- అమ్మవారిని దర్శించుకోకుండానే వెనుదిరిగిన భక్తులు
- పాఠాలు నేర్వని అధికార యంత్రాంగం

బాసర, ఫిబ్రవరి 14 : ఉత్సవాలకు, బాసర ఆలయానికి రావడానికే భక్తులు బయపడిపోతున్నారు. ఇక్కడ ఉన్న అసౌకర్యాలు భక్తుల ఆందోళనకు కారణమవుతుంది. ఒకటి కాదు రెండు కాదు నవరాత్రి, వసంత పంచమి ఇలా ప్రతీ ఉత్సవం ప్రతీఏటా భక్తులకు కష్టాలు తప్పడం లేదు. వచ్చిన భక్తులకు సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు సమయానికి చేతులెత్తేస్తు న్నారు. ఉత్సవాల కంటే ముందు ఏర్పాట్లపై ఆర్భాటంగా ప్రకటనలిస్తున్న అధికార యంత్రాంగం ఆ తర్వాత షరా మామూలైపోతుంది. కనీసం వచ్చిన భక్తులకు తాగునీరు అందించలేని దుస్థితి ఏర్పడుతుంది. భక్తుల నుంచి కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ వారికి కనీస సౌకర్యాలను ఏర్పాట్లు చేయలేని యంత్రాంగం ఇక్కడ తిష్టవేసిందనే చెప్పవచ్చు. ఫలితంగా ఈ సారి వసంతపంచమి వేడుకల్లో కూడా భక్తులు తీవ్రకష్టాల పాలయ్యారు. అమ్మవారి జన్మదినమైన వసంతపంచమి పర్వదినాన తమ పిల్లలకు అక్షర శ్రీకారపూజ ఆనందోత్సవాల మధ్య జరిపించుకునేందుకు వచ్చిన భక్తుల ఆశలపై అధికారులు మరోసారి నీళ్లు చల్లారు. మొక్కుబడిగా ప్రతి సంవత్సరం లాగే నామమాత్రపు ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకున్నారు.

ఏర్పాట్లంటే క్యూలైన్లు.. రంగు రంగు విద్యుద్దీపాలేనా ?

ప్రతీ సంవత్సరం అమ్మవారి ఆలయంలో జరిగే ఉత్సవాల ఏర్పాట్లు ప్రణాళిక లోపంగా జరుగుతున్నాయి. భక్తులు, స్థానికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండానే గతంలో చేసిన పొరపాట్లనే పునరావృతమవుతున్నాయి. ఇక్కడ అధికార యంత్రాంగానికి ఉత్సవాల ఏర్పాట్లంటే కొన్ని వెదురు బొంగులతో క్యూలైన్లు కట్టడం, విద్యుద్దీపాలను ఏర్పాటు చేయడమే ఇక్కడ అధికారుల దృష్టిలో ఏర్పాట్లుగా చెప్పుకోవచ్చు. వచ్చిన భక్తులకు ఉండేందుకు తాత్కాలిక వసతులు, ఇబ్బందులు లేకుండా పూజలు జరిగేలా చర్యలు ఇక్కడ కనిపించడం లేదు. ప్రతీ సంవత్సరం ఇంత మంది భక్తులు వస్తారని అంచనా ఉన్నప్పటికి ఆ దిశగా అధికారులు దృష్టి సారించడం లేదు. క్యూలైన్లలో భక్తులకు కనీసం తాగునీరు అందడం లేదు. అత్యవసర సమయాల్లో మల, మూత్ర విసర్జన అవసరాల క్యూలైన్ల నుంచి బయటకు వెళ్లేందుకు మార్గాల్లేవు. ఇక వృద్దుల, చిన్నారుల పరిస్థితి మరింత దారుణం. క్యూలైన్లలో కనీసం బెంచీల్లాంటివి ఏర్పాట్లుండవు. నేలపైనే సేదతీరాలి. ఇక అక్షర శ్రీకార మండపంలో ఒక క్రమపద్ధతి లేకుండా తోపులాటల దృశ్యాలు బుధవారం దినమంతా కనిపించాయి. త్వరగా పూజ చేసుకోవడానికి నెట్టుకోవడం ఒకటే మార్గమనే ఇక్కడ పరిస్థితి చూస్తే కనిపించింది. ఎంతో ఆనందంగా ప్రశాం తంగా పిల్లలకు అక్షరశ్రీకారం జరిపించుకుందామనుకున్న భక్తులు ఇలాంటి పరిణామాలు ఎదురవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు..

దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగిన భక్తులు

అమ్మవారిని దర్శించుకునేందుకు, అక్షర శ్రీకారపూజలు జరిపించుకునేందుకు భక్తులకు గంటల తరబడి సమయం పట్టింది. బాసరకు చేరుకున్న భక్తులకు అడుగడుగునా అసౌకర్యాలు ఇబ్బందులకు గురిచేయడంతో చాలా మంది భక్తులు వేచి చూడలేక మధ్యలోనుంచే వెనుదిరిగి పోయారు. మరికొంత మంది భక్తులు తమ పిల్లలకు అక్షర శ్రీకా ర పూజలు జరిపించి అమ్మవారిని దర్శించుకోకుండానే వెళ్లిపోవడం కనిపించింది. ఆలయం వెలుపల కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

వాహనాల నిలిపివేతతో భక్తుల ఇబ్బందులు

అసలే అరకొర వసతులతో ఇబ్బంది పడుతున్న భక్తులకు అధికార యంత్రాంగం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల భక్తులు మరింత కష్టాలకు గురవుతున్నారు. రాత్రి 11 గంటల నుంచి భక్తుల వాహనాలను గుడివద్దకు అనుమతించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలను ఆలయానికి కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేయడం అక్కడి నుంచి భక్తులు సామాగ్రితో, లగేజీతో ఆలయానికి చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రణాళిక మరోసారి విఫలమైంది.


పిల్లల ఈతిబాధలు తీర్చేందుకు క్యూలైన్ల నుంచి బయటకు వచ్చిన భక్తులు

సరస్వతీ నమస్తుభ్యం

- వసంత పంచమి వేళ బాసరకు తరలివచ్చిన భక్తజనం
- అమ్మవారి సన్నిధిలో భారీగా అక్షర శ్రీకార పూజలు



అమ్మవారి సన్నిధిలో తమ పిల్లలకు అక్షర శ్రీకారం జరిపిస్తున్న భక్తులు

బాసర, ఫిబ్రవరి, 14 : సరస్వతీ నమస్తుభ్యం.. నామస్మరణతో చదువుల తల్లి కొలువై ఉన్న బాసర పుణ్యక్షేత్రం మార్మోగింది. వసంతపంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అమ్మవారి జన్మదినమైన వసంత పంచమి పర్వదినాన తమ పిల్లలకు అక్షర శ్రీకారం జరిపించేందుకు భక్తులు వ్యయప్రయాసాలు ఓర్చి బాసర అమ్మవారి క్షేత్రానికి చేరుకున్నారు. రద్దీని దృష్టిని ఉంచుకొని అధికారులు తెల్లవారు జామున 3 గంటల నుండే అక్షర శ్రీకార పూజలను ప్రారంభించారు. మూడు చోట్ల నిర్విరామంగా పూజలు కొనసాగించారు. హాజరైన భక్తుల కోసం క్యూ లైన్లలో పాలు, బిస్కెట్లు స్థానికుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రజా ప్రతినిధులు


అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రజాప్రతినిధులు

సరస్వతి అమ్మవారి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆ చదువుల తల్లికి పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎంపీ సోయం బాపురావు, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎమ్మెల్సీ దండే విట్టల్, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ జ్యోతి తదితరులు అమ్మవారికి భాజా భజంత్రీల మధ్య పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రతీఏటా దేవాదాయ శాఖ మంత్రి ప్రభుత్వం తరపున వసంతపంచమి నాడు పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. పదేళ్లుగా కొనసాగుతున్న ఈ పద్ధతి ఈసారి దేవాదాయశాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖ గైర్హాజరు తో బ్రేక్ పడింది. వసంత పంచమిని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల అమ్మవారిని దర్శించుకున్నారు.

రికార్డు స్థాయిలో అక్షర శ్రీకార పూజలు


భద్రతా ఏర్పాట్లలో పోలీసులు

వసంత పంచమి పురస్కరించుకొని బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో బుధవారం రికార్డుస్థాయిలో అక్షర శ్రీకార పూజలు నమోదు అయ్యాయి. 7,646 మంది చిన్నారులు అక్షర శ్రీకారపూజలు జరిపించుకున్నారు. ఒక్క రోజులో ఇంత సంఖ్య ఆలయ చరిత్రలో ఏనాడు నమోదు కాలేదు. కేవలం వివిధ టికెట్ల విక్రయం ద్వారానే దేవస్థానానికి సుమారు రూ. 62లక్షల ఆదాయం సమకూరింది.

భక్తి శ్రద్ధలతో మార్కండేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ


ఆలయంలో ప్రతిష్టించిన మార్కండేయ స్వామి విగ్రహం

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 14 : మండలంలోని కాల్వ గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ మార్కండేయ స్వామి విగ్రహాన్ని నియమ నిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. రామానుజ శ్రీనివాస్, రాము, తదితర వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి మూల విరాట్‌ను గర్భగుడిలో ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ తిరుమల శ్రీనివాస్, గట్టు స్వామి, నర్సయ్య, పద్మశాలి సంఘం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరంతర ప్రేమకు నిలయమే భారతదేశం

- ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజు కాదు.. వీర జవాన్ల దివస్ జరుపుకోవాలి
- భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల చిత్రపటాల దహనం


వాలెంటైన్స్ డేకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న భజరంగ్‌దళ్

ఖానాపూర్, ఫిబ్రవరి 14 : యుగయుగాలుగా నిరంతర ప్రేమకు నిలయమైన భారత దేశంలో ప్రేమికుల కోసం ప్రత్యేకమైన రోజును జరుపుకోవడం సరికాదని బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ కాశవేణి ప్రణయ్ కుమార్ అన్నారు. బుధవారం వాలెంటైన్స్ డేకు వ్యతిరేకంగా ఖానాపూర్‌లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్‌లో ఉగ్రవాదుల చిత్రపటాలను, వాలెంటైన్స్ డే గ్రీటింగ్ కార్డులను దహనం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... ఫిబ్రవరి 14వ తేదీని ప్రేమికుల రోజుగా కాకుండా వీర జవాన్ల దివస్‌గా జరుపుకోవాలన్నారు. 2019 ఫిబ్రవరి 14వ తుదీన పుల్వామాలో ఉగ్రమూకల దాడిలో అమరులైన వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. విదేశీ సంస్కృతి వద్దని భారత దేశ సంస్కృతి ముద్దు అని నినాదాలు చేస్తూ వాలెంటైన్స్ డేను జరుపుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ పట్టణ సంయోజక్ పచిమట్ల శివ గౌడ్, నాయకులు శ్రీను, రాజశేఖర్, సంజయ్, హరీష్, అజయ్, లోకేష్, భూమేష్ సాయి హరీష్, తదితరులున్నారు.

రేపు దేగాంలో రాస్తారోకో


కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ముథోల్, ఫిబ్రవరి 14 : రైతాంగ సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా భైంసా మండలం దేగాంలో జరిపే రాస్తారోకోలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి జే. రాజు పిలుపునిచ్చారు. బుధవారం ముథోల్ మండలంలోని మచ్కల్, రాంటెక్, ముద్గల్, న్యూ ముద్గల్, సరస్వతి నగర్‌లలో సంబంధిత కరపత్రాలు పంపిణీ చేస్తూ రైతు గ్రామీణ భారత్ బంద్ ప్రచారం చేశారు. కనీస మద్దతు ధర చట్టం, స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని, రైతు రుణాల మాఫీ, రైతు కూలీల పెన్షన్, రైతు వ్యతిరేక చట్టాల రద్దు, రైతు ఉద్యమం సందర్భంగా రైతులపై పెట్టిన కేసుల ఉపసంహరణ రాస్తాకోకోలో అధిక సంఖ్యలో రైతులు హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంస్ జిల్లా నాయకులు గంగాధర్ తదితరలు పాల్గొన్నారు.

ప్రధానిమోదీ నేతృత్వంలోని ప్రగతిపై విస్తృత ప్రచారం చేపట్టాలి

- ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావ్



మాట్లాడుతున్న పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావ్

భైంసా, ఫిబ్రవరి 14 : బీజేపీ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తరలివెళ్లి ప్రధానిమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రగతి, సంక్షేమంపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావ్ పిలుపునిచ్చారు. బుధవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్‌తో కలిసి అసెంబ్లీ ప్రవాస్ యోజన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, ముథోల్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ సారథ్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావ్ పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశా, నిర్దేశం చేశారు. ఎన్నికల కోసం పార్టీ శ్రేణులన్నీ సన్నద్ధమవ్వాలన్నారు. కార్యకర్తలంతా కార్యోన్ముకులవ్వాలన్నారు. బూత్‌స్థాయి నుంచి ఇంటింటికి వెళ్లి ప్రధానిమోదీ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, చేపట్టిన సంస్కరణలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఇదే క్రమంలో కాంగ్రెస్,బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని సూచించారు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మరోమారు ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానపరిధిలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలంతా అంకితభావంతో ముందుకు సాగలన్నారు. ఈ నెల 20 నుంచి పార్టీ ఆధ్వర్యంలో బాసర నుంచి ప్రారంభమయ్యే విజయ సంకల్ప బస్సుయాత్రను బీజేపీ శ్రేణులన్నీ బాధ్యతాయుతగా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ మాట్లాడుతూ తీస్రీ బార్ మోదీ సర్కార్ లక్ష్యంతో పార్టీ శ్రేణులు పార్లమెంట్ ఎన్నికల పోరు చేపట్టాలన్నారు.ఇందులో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపెల్లి ఇంచార్జీ రావుల రాంనాథ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్‌తో పాటు నియోజక వర్గ పరిధిలని ఆయా మండలాల పార్టీ బాధ్యులు, ప్రధానశ్రేణులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన సెక్టోరియల్ ఆఫీసర్


విద్యార్థులతో మాట్లాడుతున్న సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీదేవి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని కేజీబీవీ సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీదేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు ఉత్తమ మార్కులు సాధించేందుకు అవసరమైన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా పరీక్షలంటే భయపడవద్దని, ప్రణాళికబద్ధంగా చదివితే పరీక్షలను సులువుగా ఎదుర్కోవచ్చన్నారు. త్వరలోనే పరీక్షలున్న నేపథ్యంలో ఇప్పటినుంచే అందుకు అన్ని విధాల సిద్ధం కావాలని సూచించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు సబ్జెక్టుల వారీగా పరీక్షలపై అవగాహన కల్పించాలని ప్రత్యేక అధికారి అపర్ణకు సూచించారు.

బాసర అమ్మవారిని దర్శించుకున్న ఎస్పీ జానకి షర్మిల

ముథోల్, ఫిబ్రవరి 14 : బాసరలో వసంత పంచమి పురస్కరించుకొని ఎస్పీ డా.జి. జానకి షర్మిల బుధవారం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బందోబస్తును పర్యవేక్షించారు. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రావడంతో ఎలాంఇట అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. భక్తుల దర్శనం ప్రశాంతంగా జరుగు తోందని, ఎక్కడికక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఐపీఎస్, ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

- గీజర్ ఆన్ చేసి స్నానం చేస్తుండగా షార్ట్ సర్క్యూట్
- మరో నాలుగు రోజుల్లో యువకుడి పెళ్లి ఉండగా విషాదం

ఖానాపూర్, ఫిబ్రవరి 14 : గీజర్ ఆన్ చేసి స్నానం చేస్తుండగా.. షార్ట్ సర్క్యూట్‌తో ఓ యువకుడు మృతి చెందిన ఘటన కడెం మండలం చిన్న బెల్లాల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చిన్న బెల్లాల్ గ్రామానికి చెందిన మీరాల వినోద్(25) ఐదేళ్ల క్రితం ఇరాక్ దేశానికి వలస వెళ్లాడు. అక్కడ సంపాదించిన డబ్బులను తల్లిదండ్రులకు పంపించగా.. వారు చిన్న బెల్లాల్ గ్రామంలో ఇంటిని నిర్మించారు. దీంతో నెల రోజుల క్రితమే ఇరాక్ నుండి వినోద్ తన స్వగ్రామానికి వచ్చాడు. ఈ సమయంలోనే జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకునేందుకు పెద్దలు సంబంధం కుదిర్చారు. ఈ నెల 18వ తేదీన వినోద్‌కు, ఆ యువతికి వివాహం జరగాల్సి ఉంది. నూతన ఇంటి పనుల్లో భాగంగా బాత్‌రూమ్‌లో కొత్త గీజర్ ఏర్పాటు చేయించాడు. ఆ గీజరే తన పాలిట మృత్యువుగా మారుతుందని ఆ యువకుడు గ్రహించలేకపోయాడు. బుధవారం ఉదయం గీజర్ ఆన్ చేసుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్లి షవర్ ఆన్ చేయగానే.. నీళ్ల ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి.. వినోద్ అక్కడికక్కడే మృతి చెందాడు. వినోద్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

అయోధ్యకు బీజేపీ నాయకులు



అయోధ్యకు బయలుదేరుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

దస్తూరాబాద్, ఫిబ్రవరి 14 : మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. బుధవారం సాయంత్రం వారు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైలు ద్వారా అయోధ్యకు బయలుదేరనున్నట్లు వారు తెలిపారు. అయోధ్యలో బాలరాముడి దర్శనానికి వెళ్లడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కే. లక్ష్మణ్, సంతోష్ కుమార్, రాజేష్, భూమేష్ సత్యం గౌడ్, ఎం. రెడ్డి, జగన్, చారి, రాజు, నరేష్, తదితరులు ఉన్నారు.

..తరలివెళ్లిన కుంటాల మండల వాసులు



కుంటాల, ఫిబ్రవరి, 14: అయోధ్య రామయ్య దర్శనానికి బుధవారం కుంటాల మండలం కల్లూర్, దౌనెల్లి, అందకూర్ తదితర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ప్రత్యేక రైలులో వెళ్లి అయోధ్య రామున్ని దర్శించుకొని తిరిగి రానున్నట్లు వారు పేర్కొన్నారు. తరలివెళ్లిన వారిలో మండల కన్వీనర్ గుడ్డేటి నర్సయ్యతో పాటు పలువురు మండల వాసులు వెళ్లారు.

సంక్షిప్త సమాచారం

అంగవైకల్యానికి కారకుడైన వ్యక్తికి జైలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 14 : ట్రాక్టర్ అజాగ్రత్తగా నడిపిస్తూ ఆటోను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న లింగారెడ్డికి రెండుకాళ్లు విరిగి అంగవైకల్యం పొందాడు. డ్రైవర్ అజీమ్‌కు గాయాలయ్యాయి. ఇందుకు కారకుడైన డ్రైవర్ రాపని ఎల్లయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ సంఘటన 31 అక్టోబరు 2016లో దిలావర్‌పూర్ మండలం బన్సపల్లి వద్ద చోటుచేసుకుంది. ఏపీపీవో జి. రామకృష్ణ తొమ్మిది మంది సాక్షులను ప్రవేశపెట్టి విచారణ జరుపగా నేరం రుజువైంది. నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయాధికారి ఆర్. అజయ్‌కుమార్ నేరస్తుడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, 2500ల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయ అధికారి సక్రియానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

అంబులెన్సులో ప్రసవం


జన్మించిన శిశువును చూపుతున్న సిబ్బంది

కుభీర్, ఫిబ్రవరి 14 : మండలంలోని హల్దా గ్రామానికి చెందిన తేజాబాయి అను మహిళ బుధవారం 108అంబులెన్సులో ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు అంబులెన్సు సిబ్బంది ఈఎంటీ లక్ష్మణ్, పైలట్ కాజామోహినోద్దిన్‌లు తెలిపారు. వివరాల ప్రకారం సదరు మహిళలకు పురిటి నొప్పులు రావడంతో అంబులెన్సు కాల్ చేయగా అంబులెన్సులో ఆసుపత్రికి తరలిస్తున్నారు. మార్గ మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్సులోనే ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని వారు తెలిపారు.

నేడు రేడియో కిసాన్ దివస్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 14 : ఆకాశవాణి అన్ని కేంద్రాల్లో గురువారం రేడియో కిసాన్ దివస్ నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ కేంద్ర ముఖ్య కార్యనిర్వాహణ అధికారి రామేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. కిసాన్ వాణికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని ఆకాశవాణి కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుపుతున్నట్లు తెలిపారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ 2004లో కిసాన్ వాణి పేరిట ఆకాశవాణి ప్రారంభించిందన్నారు. రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తూ వారిని చైతన్యపరుస్తున్నామని తెలిపారు.

రేపటి సమ్మెకు మద్దతు : టీఏజీఎస్


నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 14 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షుడు తొడసం శంభు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీలపై దాడులు, అడవుల ప్రైవేటీకరణ, షెడ్యూల్ ప్రాంతాల ఎత్తివేత తదితర విధానాలు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్రం విఫలమైందన్నారు.

పల్లెలకు దూరంగా చౌకధరల దుకాణాలు

కుభీర్, ఫిబ్రవరి 14 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద మధ్య తరగతి ప్రజలకు ప్రతీనెల రేషన్‌షాపుల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంది. మండంలోని పల్లె ప్రాంతాల్లో సరిపడా రేషన్ దుకాణాలు లేవు. పక్క గ్రామాల్లో వారికి కేటాయించిన దుకాణాలు ఉండడంతో రేషన్ తెచ్చుకునేందుకు ప్రతీ నెల ఇబ్బందులు పడుతున్నారు. ఏండ్ల తరబడి ఇదే తంతు కొనసాగుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు విన్నవించుకున్న పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు రేషన్‌బియ్యం తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణభవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్‌ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్‌ఎంసీ పరిధిలో తిష్ఠవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్‌ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



బోథ్ సరస్వతీ శిశుమందిర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తలమడుగులో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు

- పలుచోట్ల సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు

ఉట్నూర్, ఫిబ్రవరి 14: మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో బుధవారం వసంత పంచమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి సంతోష్‌దుబే ఆధ్వర్యంలో సాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో యజ్ఞం నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా భక్తులు ఆలయానికి చేరుకుని సాయిబాబాను దర్శించుకున్నారు.

తలమడుగు: వసంత పంచమి పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీకేంద్రంలో ఘనంగాసామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతనంగా పాఠశాలకు వచ్చే విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో వేద పండితులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. వసంత పంచమి రోజు చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమని అంగన్‌వాడీ టీచర్లు రమణ మంజుల, పద్మ తెలిపారు.

బోథ్: వసంత పంచమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ నాగభూషణం పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో హెచ్ఎంలు రాజేందర్‌గౌడ్, కిషోర్ కుమార్, పంద్రం శంకర్, ప్రసాద్, సంతోష్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, సోనాల మండల కేంద్రంలోని వివేకానంద ప్రైవేటు పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరభ్యాసం చేయించుకున్న విద్యార్థులకు పలక బలపం అందజేశారు. అక్షరభ్యాసం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం నిర్వహించారు. ఇందులో ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య, పి.ఇస్తారు, కోస్నెట్టి శుద్ధోధన్, హరీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఐక్యంగా ఉంటే అభివృద్ధి సాధ్యం'

తలమడుగు, ఫిబ్రవరి 14: అందరూ ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఎమ్మెల్సీ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షలతో మాల సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడారు. ఇందులో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బొల్లారపు బాబన్న, ఎంపీటీసీ వెంకన్న, మాల సంఘం అధ్యక్షుడు నడ్పన్న, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఫరూక్, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌కు ఢీకొని ఒకరి మృతి

భీంపూర్, ఫిబ్రవరి 14: డివైడర్‌కు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిప్పల్ కోటి గ్రామానికి చెందిన జాటల అశోక్(38) తన కుమారుడు విశాల్‌తో కలిసి మంగళవారం రాత్రి నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు మోటర్ బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో నేరేడిగొండ వద్ద వెనుక నుంచి మరో మోటార్‌బైక్ ఢీకొనడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకు విశాల్‌కు కాలు విరిగింది. గమనించిన హైవే పెట్రోలింగ్ వారు ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏటీఎంలో మోసపూరిత చోరీ

మావల, ఫిబ్రవరి 14: పట్టణంలోని ఓ ఏటీఎం సెంటర్‌లో మోసపూరిత చోరీకి దుండగులు పాల్పడ్డారు. మావల ఎస్సై విష్ణువర్ధన్ వివరాల ప్రకారం.. పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన సతీష్ దేశ్‌పాండే దస్నాపూర్‌లోని కెనరా బ్యాంకు ఏటీఎం సెంటర్‌కు డబ్బులు విత్ డ్రా చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో ఏటీఎం కార్డును మిషన్‌లో పెట్టి రూ.ఐదు వేలు విత్ డ్రా చేశాడు. కానీ డబ్బులు బయటకు రాలేదు. ఏదో టెక్నికల్ ఎర్రర్ ప్రాబ్లం వచ్చిందనుకుని బయటకు వచ్చేశారు. అయితే డబ్బులు విత్ డ్రా అయినట్లు సందేశం రావడంతో అనుమానం వచ్చి మావల పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. సీసీ పుటేజీని పరిశీలించగా ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఘనంగా హన్మాన్‌సాయి ఆలయ వార్షికోత్సవం

ఇచ్చోడ, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని హన్మాన్‌సాయి ఆలయ వార్షికోత్సవం వేడుకగా జరిగింది. తెల్లవారుజామునే వీరహనుమాన్ విగ్రహానికి, సాయిబాబా విగ్రహానికి అభిషేకం నిర్వహించి వేదపండితుల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన సాయిబాబా విగ్రహానికి, ఉత్సవమూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భాజాభజంత్రీల మధ్య పల్లకీ సేవను పట్టణంలోని పురవీధుల గుండా డీజే చప్పుళ్ల మధ్య ఘనంగా భక్తులు ఊరేగించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆలయ వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జాతరలో తిరుగుతూ సందడి చేశారు. అనంతరం మహాప్రసాదం అన్నదానంలో భక్తులు పెద్దఎత్తున్న పాల్గొన్నారు.

నేడు సేవాలాల్ మహరాజ్ జయంతి

ఉట్నూర్, ఫిబ్రవరి 14: లంబాడా గిరిజనుల ఆధ్యాత్మిక గురువు సేవలాల్ మహరాజ్ జయంతిని ఉమ్మడి జిల్లాలోని గిరిజనులు గురువారం తండా తండాలో నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు. బంజారాల ధర్మం ప్రకారం తండా రాజ్యమే గొప్పదని, ప్రతీఒక్కరు ధర్మబద్ధంగా జీవిస్తారని భావించిన సేవలాల్ పుట్టిన ఫిబ్రవరి 15న జన్మదిన కార్యక్రమాలను జయప్రదం చేయనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గుత్తిపట్టడానికి దగ్గరలో ఉన్న సేవాగడ్‌లో భీమానాయక్, ధర్మినిబయి దంపతులకు సేవలాల్ మహరాజ్ జన్మించారు. సామాజిక కట్టుబాట్లను మూఢాచారాలను వర్గ విభేదాలను నిర్మూలించడానికి ప్రేమ, శాంతి,త్యాగం, సత్యం, ధర్మజీవనం అని పంచ సూత్రాలను అందించి, తన పార్థీవ శరీరాన్ని మహారాష్ట్రలోని పౌరాగడ్‌లో అమ్మ జగన్మాత రాధాదేవిలో విలీనమయ్యాడని బంజారాల నమ్మకం. రాధా దేవి జగదాంబ అవతారం ఎత్తి సేవాలాల్‌ను ఈ లోకానికి పంపిందని ప్రతీతి.

అలాగే, ఉమ్మడి జిల్లాలోని లంబాడా గిరిజనులు నివసిస్తున్న తండాలు, పట్టణాలలో గురువారం సేవాలాల్ జయంతి పురస్కరించుకుని బోగ్ బండారా కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీ గ్రామంలో దుర్గాదేవి సేవాలాల్ మందిరాల వద్ద జెండాలు ఆవిష్కరించి బోగ్ బండారా కార్యక్రమాలను బంజారా సంస్కృతీ, సంప్రదాయాలతో నిర్వహించనున్నారు. స్థానిక సేవదాస్ నగర్‌లో ఉన్న సేవాలాల్ మందిరం వద్ద గురువారం బోగ్ బండారా నిర్వహించనున్నారు.

బీజేపీలో మహేశ్వర్‌రెడ్డికి అగ్రపీఠం..!

- లెజిస్లేచర్ పార్టీ నేతగా ఎంపిక
- మొన్నటి ఎన్నికల మెజార్టీ, గత అనుభవాలే ప్రతిపాదిక
- కొలమానంగా అన్ని అంశాలపై అవగాహన
- వాగ్ధాటిలో దిట్ట
- మరోసారి నిర్మల్‌కు రాజకీయంగా దక్కిన ప్రాధాన్యత



నిర్మల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డికి బీజేపీ అధిష్ఠానం అగ్రపీఠం కట్టబెట్టింది. ఆయనను శాసనసభలో కీలకమైన లెజిస్లేచర్ పార్టీ నేతగా ఎంపిక చేసి ఆశించిన గౌరవాన్ని కట్టబెట్టింది. గత కొద్దిరోజుల నుంచి బీజేఎల్పీ లీడర్ ఎంపిక వ్యవహారం ఆ పార్టీలోనే కాకుండా రాజకీయంగా ఉత్కంఠకు లోనుచేసింది. మహేశ్వర్‌రెడ్డితో పాటు సీనియర్ ఎమ్మెల్యే రాజాసింగ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అలాగే కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకట రమణారెడ్డిలు ఈ పదవిని ఆశించారు. అయితే సీనియర్ నేత రాజాసింగ్ నుంచి మహేశ్వర్‌రెడ్డికి పోటీ ఎదురైంది. మహేశ్వర్‌రెడ్డికి రాజకీయంగా పరిపాలన పరమైన అంశాల్లో మంచి అవగాహన ఉండడం సమస్యలపై అనర్గళంగా మాట్లాడే సత్తా ఉండడాన్ని అధిష్ఠానం పరిగణలోకి తీసుకుంది. అలాగే గతంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవంతో పాటు ఇటీవలే ఎన్నికల్లో ఆయన 50వేలకు పైగా మెజార్టీ ఓట్లతో గెలుపొంది పార్టీ ప్రతిష్ఠను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తరింపజేశారు. మహేశ్వర్‌రెడ్డి టీవీ డిబేట్‌లలోనూ, చర్చా వేదిల్లోనూ అన్ని అంశాలపై పూర్తి అవగాహనతో అనర్గళంగా మాట్లాడుతూ ఎదుటి వారిని ఏ విషయంలోనైనా ఒప్పించే నేర్పరిగా బీజేపీ అధిష్ఠానం గుర్తించింది. గత కొంతకాలం నుంచి కొనసాగుతున్న సస్పెన్స్‌కు బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి తెర దించుతూ మహేశ్వర్‌రెడ్డిని బీజేపీ లెజిస్లేచర్ పార్టీ నేతగా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో మహేశ్వర్ రెడ్డికి బీజేపీలో రాష్ట్ర అధ్యక్షుని తరువాత నెంబర్ టూగా చెప్పుకునే లెజిస్లేచర్ పార్టీ లీడర్ పదవి దక్కినట్లయ్యిందంటున్నారు. ఇప్పటికే శాసనసభలో మహేశ్వర్‌రెడ్డి అటు బీఆర్‌ఎస్ ఇటు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు చేస్తూ సర్కారు తప్పిదాలను ఎత్తిచూపడంలో సక్సెస్ అయ్యారు. అన్ని అంశాలపై మహేశ్వర్‌రెడ్డి అనర్గళంగా ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇలా సుదీర్ఘ అనుభవం ఉన్న నేతగా గుర్తింపు పొందిన మహేశ్వర్ రెడ్డికి బీజేపీ అధిష్ఠానం లెజిస్లేచర్ పార్టీ లీడర్ పదవిని అప్పజెప్పి పార్టీలో సముచితస్థానం కల్పించిందని అంటున్నారు. మహేశ్వర్‌రెడ్డికి బీజేఎల్పీ పదవి దక్కడం పట్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి.

మొదటి నుంచి కీలక పదవులే..

ఇదిలా ఉండగా మహేశ్వర్‌రెడ్డి తాను కొనసాగిన పార్టీల్లో అన్ని కీలక పదవులే నిర్వర్తించారు. రాజకీయ వ్యూహ నిపుణుడిగా ఎదుటి పార్టీలకు ధీటుగా కార్యక్రమాలను కొనసాగించే నేతగా మహేశ్వర్‌రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచే తనదైన శైలిలో రాజకీయ కార్యకలాపాలను కొనసాగించి అధిష్ఠానానికి చేరువయ్యారు. 2009 ఆయన అనూహ్యంగా సినీనటుడు చిరంజీవి ఏర్పాటు చేసిన ప్రజారాజ్యం పార్టీలో చేరి ఆ పార్టీ టికెట్‌ను దక్కించుకున్నారు. ప్రజారాజ్యం పార్టీ టికెట్‌ను దక్కించుకోవడంలో మహేశ్వర్ రెడ్డి తనకున్న రాజకీయ పరిజ్ఞానాన్ని సంపూర్ణంగా వినియోగించుకున్నారు.



అలేఖ్య హత్యపై పౌర సమాజం స్పందించాలి


- మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి ఆత్రం సుగుణక్క

ఖానాపూర్, ఫిబ్రవరి 14 : ఖానాపూర్‌లో పట్టపగలు నడిరోడ్డు మీద జరిగిన యువతి అలేఖ్య హత్యపై పౌరసమాజం స్పందించాలని మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. బుధవారం అలేఖ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన సుగుణక్క స్థానిక విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విచక్షణారహితంగా ఓ ఉన్మాది జరిపిన మారణకాండలో అలేఖ్య అనే యువతి అక్కడికక్కడే మృతి చెందడం మరో యువతి ఇప్పటికీ ఆసుపత్రిలోనే తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాతుండడం మరో మూడేళ్ల బాలుడు సైతం గాయపడి ఇప్పుడిప్పుడే కోలుకుంటుండడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. ఈ హృదయ విదారకమైన ఘటన బారి నుంచి బాధిత కుటుంబం కోలుకునేలా ప్రభుత్వం వారికి అండగా నిలబడాలన్నారు. అలేఖ్య కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు ప్రభుత్వం నుండి రూ. కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలన్నారు. అలేఖ్య హత్య కేసులో హంతకుడితో పాటు అతనికి సహకరించిన వారందరికీ యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించాలన్నారు.



andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3, కనిష్ఠం 20.2

ఆంధ్రజ్యోతి




ఆదిలాబాద్
జిల్లా వార్తలు

గురువారం 15 ఫిబ్రవరి 2024

'కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14: మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులతో కలిసి నూతన మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్ కమిషనర్ శైలజలు ఆందోళనకారులతో మాట్లాడారు. డిసెంబర్ నెల వేతనం అందిస్తామని, త్వరలోనే ఫిబ్రవరి వేతనం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడారు.

సాదాబైనామాల సంగతే.. మరిచారు!





- జిల్లాలో భూములకు చట్టబద్దత కల్పించేందుకు దరఖాస్తులను స్వీకరించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినా.. పరిష్కారం చూపని అధికారులు
- రెండేళ్లు గడుస్తున్నా.. భూపట్టాల ఊసేలేని వైనం
- చేతిలో ఆధారం లేక.. ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న రైతులు
- అత్యధికంగా తలమడుగు మండలంలో 343 దరఖాస్తులు రాగా.. అత్యల్పంగా సిరికొండ మండలంలో 8
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై భారీ ఆశలు పెట్టుకున్న అన్నదాతలు
- జిల్లావ్యాప్తంగా మొత్తం అధికారిక లెక్కల ప్రకారం 2083 దరఖాస్తులు

ఆదిలాబాద్ ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తెల్ల కాగితాలపై క్రయవిక్రయాలు జరిపిన భూములకు చట్టబద్దతను కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల నుంచి సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించింది. దీంతో అర్హులైన వారు మీసేవా కేంద్రాల ద్వారా మండల తహసీల్దార్లకు దరఖాస్తు చేసుకున్నారు. రెండేళ్ల గడిచినా దరఖాస్తూలకు మాత్రం మోక్షం కలగడంలేదు. 2021 అక్టోబరు1 నుంచి నవంబరు 10 వరకు దరఖాస్తులను స్వీకరించారు. దీంతో జిల్లావ్యాప్తంగా మొత్తం 2083 సాదాబైనామా దరఖాస్తులు వచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఇందులో అత్యధికంగా తలమడుగు మండలంలో 343 దరఖాస్తులు రాగా అత్యల్పంగా సిరికొండ మండలంలో కేవలం ఎనిమిది దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు సంబంధిత శాఖల అధికారులు పేర్కొంటున్నారు. తరతరాలుగా పంటల సాగునే నమ్ముకుని కాస్తులో ఉన్న పట్టా పాస్‌పుస్తకాలు లేక ఎప్పుడు? ఏం జరుగుతుందోనన్న? అభద్రతా భావంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తులను క్రమబద్ధీకరించి భూమిపై హక్కులను కల్పిస్తుందని ఎంతో మంది రైతులు ఆశపడ్డా.. చివరకు నిరాశే మిగిలింది. దరఖాస్తులు స్వీకరించే సమయంలో అధికారులు ఎంతో హడావుడి చేసినా.. గడువు ముగియగానే దరఖాస్తులపై కోర్టును ఆశ్రయించడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. దీంతో దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఊసేలేకుండాపోయింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారానికి దూరమై కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో అన్నదాతలు మళ్లీ ఆశలు పెట్టుకుంటున్నారు.

తప్పని ఎదురుచూపులు

ప్రభుత్వ ఆదేశాలతో రెండేళ్ల క్రితం సాదాబైనామా దరఖాస్తులు చేసుకున్న రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. పట్టాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. గ్రామాల్లో నేతలు పర్యటిస్తున్న సమయంలోనూ కొందరూ రైతులు పట్టాలు ఎప్పుడు ఇస్తారని? ప్రశ్నిస్తున్నారు. ఏన్నో ఏళ్లుగా సాగుభూమి తమ ఆధీనంలో ఉన్నా.. పట్టా ఆధారం లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉందని రైతులు వాపోతు న్నారు. అంతేకాకుండా దరఖాస్తులను పరిశీలించకుం డానే పక్కన పడేయడంతో అసలు సాదాబైనామా దరఖాస్తుల క్రమబద్ధీకరణ ఉంటుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ సమస్యల పరిష్కారానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినా.. సమస్యకు పరిష్కారం దక్కడం లేదంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని దరఖాస్తులకు చట్టబద్దత కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలకు దూరం

వారసత్వంగా సాగుభూమిని కలిగి ఉన్నా.. ఎలాంటి ఆధారం లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు రైతులు దూరమవుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, బ్యాం కు రుణాలు దక్కడంలేదు. నాలుగైదు దశాబ్దాల క్రితం తెల్లకాగితాలపై క్రయవిక్రయాలు జరిపిన వారంతా ప్రస్తుతం మరణించడంతో వారి వారసుల పేరిట భమిని బదలాయింపు చేయడం పెద్ద సమస్యగా మారింది. ఒకవేళ దరఖాస్తులకు చట్టబద్దత కల్పిస్తే భవిష్యత్తులో చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

అంతేకాకుండా గతంలో తక్కువ దరకే భూమిని విక్రయించిన వారు మళ్లీ కోర్టును ఆశ్రయిస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చట్టపరమైన చిక్కులు తలెత్తడం తోనే ప్రభుత్వం సాదాబైనామా దరఖాస్తులకు చట్టబద్దత కల్పించలేకపోయిం దన్న వాదనలు వినిపిస్తున్నాయి. కానీ ఆశలు కల్పించిన ప్రభుత్వం సమస్యలకు పరిష్కారం చూపాలని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా సాదాబైనామాల దరఖాస్తులకు పరిష్కార మార్గాన్ని చూపాలని కోరుతున్నారు.

మండలాల వారీగా సాదాబైనామా దరఖాస్తులిలా..

మండలం	దరఖాస్తుల సంఖ్య
భీంపూర్	88
నార్నూర్	52
సిరికొండ	08
ఆదిలాబాద్ అర్బన్	22
గుడిహత్నూర్	171
ఉట్నూర్	232
బేల	67
ఇంద్రవేల్లి	27
బజార్‌హత్నూర్	100
జైనథ్	172
ఆదిలాబాద్ రూరల్	256
నేరడిగొండ	114
తలమడుగు	343
ఇచ్చోడ	105
మావల	34
తాంసి	68
బోథ్	226
గాదిగూడ	00
మొత్తం	2,083

కొత్త ప్రభుత్వం బాధిత రైతులను ఆదుకోవాలి

: బద్దం రాంచందర్‌రెడ్డి, రైతు, అడేగామ(కె), ఇచ్చోడ మండలం



రైతు కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సాదాబైనామాల దరఖాస్తులకు వెంటనే పరిష్కార మార్గాన్ని చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం బాధిత రైతులను గుర్తించి సాదాబైనామా దరఖాస్తుల సమస్యను సకాలంలో పరిష్కారించాలి.

సంక్షిప్త సమాచారం



అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

అమరవీరులకు ఘన నివాళి

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14: దేశ రక్షణలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు మరవలేనివని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న కార్గిల్ పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద సనాతనహిందు ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రతీఒక్కరు అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశ రక్షణలో జవాన్లు అందిస్తున్నసేవలు మరువలేనివని, దేశ ప్రజల హితం కోసం, ప్రజారక్షణ కోసం ఆర్మీ జవాన్లు నిరంతరం సేవలు అందిస్తున్నారని తెలపారు. ఇందులో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, సూర్యకాంత్, మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌దాస్, కెప్టెన్ మజార్, బరాడి లచ్చు, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

తాంసి, ఫిబ్రవరి 14: మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు, ఆయా గ్రామాల కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సాయినగర్ కాలనీలో సేవాలాల్ జయంతి : బంజారా సమితి

బోథ్, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో గురువారం సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు బంజారా సేవా సమితి వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అంతేగాక సేవాలాల్ జయంతి అయిన ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని వారు కోరారు.

'అభివృద్ధి ధ్యేయంగా ముందుకు'

బోథ్, ఫిబ్రవరి 14: కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, పార్టీ ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తుందని నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సోనాల శివాజీనగర్, దేవులనాయక్ తండాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తమవంతుగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెట్లపెల్లి అనిల్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రమేష్, బత్తుల నాయకులు గాజుల పోతన్న, విజయ్, భాస్కర్ రెడ్డి, భాయ్ సంపత్‌నాయక్, తండా మాజీ సర్పంచ్ సకారం, ఎంపీటీసీ రోహిదాస్, బలిరాం, సదాశివ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కేస్లాపూర్ నాగోబా జాతర

- నాగోబా (శేషనాగు) దర్శనం కోసం తరలివస్తున్న భక్తజనం
- వసంత పంచమి సందర్భంగా ఆలయ ఆవరణలో అక్షరాభ్యాసం కార్యక్రమం
- జాతరలో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణ సముదాయాలు
- రంగుల రాట్నాల వద్ద చిన్నారుల సందడి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 14: ఆదివాసీ గిరిజనుల ఇలవేల్పు కేస్లాపూర్ నాగోబా జాతరకు బుధవారం వివిధ ప్రాంతాల నుంచి నాగోబా(శేషనాగు)ను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో కేస్లాపూర్ సందడిగా మారింది. స్థానిక తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి నాగోబా దేవతను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి నాగోబా చిత్ర పటాన్ని బహూకరించారు. అదేవిధంగా, నాగోబా ఆలయంలో వసంత పంచమి సందర్భంగా మెస్రం వంశీయుల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సామూహిక అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సామూహిక అక్షరభ్యాస కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. ఆలయ పరిసరాలతో పాటు జాతరలో వెలిసిన వివిధ దుకాణాలు, రంగుల రాట్నాల వద్ద భక్తులు, చిన్నారుల సందడి కనిపించింది. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మెస్రం షేకనాథ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం షేఖు, మెస్రం సోనేరావు, తదితరులు పాల్గొన్నారు.



నాగోబా దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం



ఆలయ ఆవరణలో అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్యామ్‌పూర్‌కు చేరుకున్న మెస్రం గిరిజనులు

ఉట్నూర్: కేస్లాపూర్ నాగోబా చెంత నుంచి మెస్రం గిరిజనులు బుధవారం ఉట్నూర్ మండలం షాంపూర్ బుడుందేవ్ ఆలయ ప్రాంతానికి చేరుకున్నారు. గత వారానికి పైగా రోజులుగా కేస్లాపూర్ నాగోబా ఆలయం వద్ద బస చేసిన మేస్రం వంశీయులు బేతాల్ పూజలు పూర్తి చేసుకుని ఎడ్లబండ్ల ద్వారా షాంపూర్ బుడుందేవ్ వైపు పైనమయ్యారు. మార్గమధ్యంలో హర్కాపూర్ గ్రామ పొలిమెరలో బసచేసిన గిరిజనులు షాంపూర్‌కు ఉదయం చేరుకుని ఆలయ పరిసర ప్రాంతాలలో డేరాలు వేసుకుని బస చేశారు. తమ వెంట తెచ్చుకున్న పూజా సామగ్రిని బండరాళ్లపై పేరక్చి భూమికి తగలకుండా ఉంచారు. గురువారం ఉదయం 10 గంటలకు బుడుందేవ్‌కు పూలు చేసి షాంపూర్ జాతరను ప్రారంభిస్తారు. అనంతరం మెస్రం గిరిజనులు తమ తమ ఇళ్లకు తిరుగుముఖం పడతామని కోసు పటేల్ వివరించారు.



రంగుల రాట్నాల వద్ద భక్తులు, చిన్నారుల సందడి



శ్యామ్‌పూర్ భుడుందేవ్ ఆలయం పాంతానికి చేరుకున్న మెస్రం గిరిజనులు



బండరాళ్లపై పెట్టిన పూజా సామగ్రి

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్
- 285వ జయంతి వేడుకల నిర్వహణపై అధికారులు, బంజారా కమిటీ సభ్యుల సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14: ఈనెల 28న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులు, బంజారా కమిటీ సభ్యులతో సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకల నిర్వహణపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను బంజారా సంప్రదాయ పూజా కార్యక్రమాలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా వారికి సూచించారు. ఇందులో భాగంగా షామియానాలు, బారికేడింగ్, భోజనం, మరుగుదొడ్లు, తాగు నీరు, వైద్యసేవలు, సౌండ్ సిస్టం, తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులకు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టి జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీరు, మొబైల్ టాయిలెట్ బాస్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలు, వాహన పార్కింగ్‌ల ఏర్పాట్లను పోలీసు యంత్రాంగం నిర్వహించాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఆర్డీవో స్రవంతి, మైనార్టీ సంక్షేమ అధికారి రమేష్‌రాథోడ్, వివిధ శాఖల అధికారులు, బంజారా ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో పాల్గొన్న అధికారులు, బంజారా కమిటీ సభ్యులు